క్లుప్తంగా

పాఠశాలకు రూ.6,500 వితరణ

సారవకోట: మండలంలోని కిడిమి ప్రాథమికోన్నత పాఠశాలకు ఆ గ్రామానికి చెందిన సీఆర్పీ ప్రసాదరావు, రొక్కం నారాయణరావులు సోమవారం ఆర్థిక సహాయం చేశారు. జాతీయ జెండా ఎగురవేసేందుకు దిమ్మ, స్తంభం ఏర్పాటు చేయాలని ప్రసాదరావు రూ.5వేలు, రొక్కం నారాయణరావు రూ.1,500 ఇన్‌చార్జి హెచ్‌ఎం రావాడ యోగేశ్వరరావుకు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

పాతపట్నం: మండలంలోని కమలమ్మ కొట్టు కూడలిలో గల పెట్రోల్ బంక్ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. పాతపట్నం నుంచి బైక్‌పై వస్తున్న ఎస్.కిశోర్, ధనుపురం నుంచి బైక్‌పై వస్తున్న కొరసవాడకు చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు సలాన రామరాజు ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నట్లు ఎస్ఐ మహమ్మద్ యాసీన్ తెలిపారు. క్షతగాత్రుడిని స్థానికులు పాతపట్నం సీహెచ్‌సీ ఆస్పత్రికి తరలించారు. రామరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బాధ్యతగా పనిచేయాలి

ఎల్.ఎన్.పేట: మండలంలోని వంశధార పునరావాస కాలనీల్లో పనిచేసేందుకు ఎంపిక చేసిన ఇద్దరు ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లుకు సోమవారం తన క్యాంప్ కార్యాలయం వద్ద పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి నియామక ఉత్తర్వులను అందజేశారు. బాధ్యతగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరుతు తీసుకురావాలన్నారు. ఉపాధి హామీ పథకం వేతనదారులకు పనులు కల్పించటంతో పాటు రైతులకు ఉపయోగపడేలా పని చేయించేలా విధులు నిర్వహించాలని సూచించారు. ఎంపీపీ రెడ్డి జ్యోతి లక్ష్మి, ఎంపీడీఓ ఆర్.కాశీప్రసాద్, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెనుమజ్జి విష్ణుమూర్తి, సర్పంచ్ తొత్తడి మురళీకృష్ణ, పార్టీ నాయకులు లోచర్ల మల్లేశ్వరావు, బలగ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ కమాండెంట్‌గా సాయికుమార్



ఆమదాలవలస: యు.పి.ఎస్.సి సెంట్రల్ ఆర్మడ్ పోలీస్ ఫోర్సెస్ (సీఏపీఎఫ్) 2022 అసిస్టెంట్ కమాండెంట్ తుది ఫలితాలు ఇటీవల వెలువడ్డాయి. ఆమదాలవలస మండలం గాజులకొల్లివలస గ్రామానికి చెందిన ప్రగడ సాయికుమార్ 61వ ర్యాంకు సాధించి యూపీఎస్సీ అసిస్టెంట్ కమాండెంట్‌గా ఎంపికయ్యారు. తండ్రి శ్రీనివాసరావు రైతు, తల్లి లీలారాణి గృహిణి. ప్రస్తుతం వీరు శ్రీకాకుళంలో నివాసముంటున్నారు. సాయికుమార్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

శ్రీముఖలింగంలో మాస శివరాత్రి పూజలు



స్వామివారి సన్నిధిలో భక్తులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో అధిక శ్రావణం మాస శివరాత్రి సందర్భంగా స్వామివారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

అర్హులందరికీ న్యాయం చేయాలి



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న బూర్లె శ్రీనివాసరావు

కొత్తూరు: వంశధార నిర్వాసితులకు అదనపు పరిహారంతోపాటు ప్రాజెక్టు కోసం భూములిచ్చిన రైతులకు నష్టపరిహారం అందజేయడంలో అర్హులందరికీ న్యాయం చేయాలని మోట్బూరు బిట్-1 ఆర్ఆర్ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బూర్లె శ్రీనివాసరావు, నిర్వాసితులు జిల్లా స్పందనలో జేసీ నవీన్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. జేసీ వెంటనే కొత్తూరు తహసీల్దార్ చక్రవర్తికి ఫోన్ చేసి అర్హత గల రైతుల అందరి పేర్లు జాబితాల్లో ఉండేలా చూడాలన్నారు. జాబితాను గ్రామ సచివాలయ కార్యాలయంలో ప్రదర్శించాలని ఆదేశించారు.

సంక్షేమ పథకాల ప్రభంజనం

- భూహక్కు పట్టాల పంపిణీలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి



భూహక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మెళియాపుట్టి: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రభంజనాన్ని చూసి టీడీపీ నేతలు ఓర్వలేకపోతున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని జోడూరు పంచాయతీ పరిధి రాజపురంలో 69 మందికి భూహక్కు పట్టాలను సోమవారం పంపిణీ చేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సీఎం జగన్ అనేక పథకాలను పంపిణీ చేస్తూ.. ప్రజల హృదయాలలో చోటు సంపాదించుకున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ మహిళలను కించపర్చేలా మాట్లాడటం తగదన్నారు. 2024లో సైతం టీడీపీకి పరాభవం తప్పదన్నారు. మారుమూల గ్రామాలకు సైతం మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు వెళ్లి సేవలందించడం.. గత ప్రభుత్వంలో చూశామా అన్నారు. శాశ్వత భూహక్కు పత్రాల ద్వారా నివసించే ఇళ్లకు, పెరటి స్థలాలకు సైతం పట్టాలు అందించడం సంతోషకరమన్నారు. దీనిద్వారా ప్రజలకు అవసరమైన సమయాలలో బ్యాంక్‌ల ద్వారా లోన్లు సైతం పొందవచ్చన్నారు. అనంతరం నా భూమి–నా దేశం కార్యక్రమంలో భాగంగా రాజపురం గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు జగన్నాథ్ నాయక్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో డీఎల్‌పీఓ ఐ.వి.రమణ, జెడ్పీటీసీ గూడ ఎండయ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు బాలరాజు, మండల కన్వీనర్ పల్లియోగి, కూర్మారావు, జయమునిరావు, సర్పంచ్‌లు సరోజిని, భాగ్యం, ఎంపీడీఓ చంద్రకుమారి, తహసీల్దార్ సరోజిని పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: వైఎస్సార్‌సీపీ విజయానికి సమష్టిగా కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి పిలుపునిచ్చారు. పాతపట్నం బ్రాహ్మణ వీధి కూడలిలో ఉన్న కేఎస్‌ఎం ప్లాజాలో పార్టీ నాయకులతో కలిసి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ నాయకులు గ్రామాల్లో తిరుగుతూ అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని, వాటిని మన పార్టీ నాయకులు, కార్యకర్తలు తిప్పి కొట్టాలన్నారు. ఇప్పటినుంచే పార్టీ విజయానికి సైనికుల్లా పని చేయాలన్నారు. గత ఎన్నికల్లో నా విజయానికి మీ ఆదరణ, ప్రేమ కారణమని, అదే స్ఫూర్తితో రానున్న ఎన్నికల్లో కూడా పనిచేద్దామన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ చూడాలని, ఆ లక్ష్యంతోనే అందరూ పనిచేయాలన్నారు. గ్రామాల్లో ప్రతీ ఇంటికి మేలు జరిగిందని, దీనిని ప్రజలకు వివరించి వారి మన్ననలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి శ్రావణ్ కుమార్, మెళియాపుట్టి, కొత్తూరు జెడ్పీటీసీలు గూడ ఎండయ్య, భాగ్యలక్ష్మి, ఎల్.ఎన్.పేట ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, కొత్తూరు, హిరమండలం, మెళియాపుట్టి, ఎల్.ఎన్‌పేట పీఏసీఎస్ అధ్యక్షులు సూర్యనారాయణ, సురేష్, బాలరాజు, కృష్ణ, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు అర్జునుడు, తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా అక్కివరం సర్పంచ్ ఎన్నిక



అక్కివరం సర్పంచ్‌గా ఎన్నికైన గురుగుబెల్లి జయ

ఆమదాలవలస రూరల్: మండలంలో అక్కివరం గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానానికి ఉప ఎన్నికలు నిర్వహిస్తున్నందున ఈ ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మెట్ట మోహన్‌రావు సోమవారం తెలియజేశారు. సర్పంచ్ స్థానానికి గ్రామానికి చెందిన గురుగుబెల్లి జయ, తాండ్ర వరలక్ష్మి నామినేషన్లు వేశారు. వరలక్ష్మి నామినేషన్‌తోపాటు, సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో తిరస్కరించారు. దీంతో గురుగుబెల్లి జయ ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ప్రకటించారు. జయను పలువురు అభినందించారు. కలివరం గ్రామ పంచాయతీ పరిధిలో గల రెండో వార్డుకు ఒక్క నామినేషన్ వేయడంతో చింతాడ సునీత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొరపాం గ్రామ పంచాయతీలో గల నాలుగో వార్డుకు మజ్జి లక్ష్మి, మజ్జి సుశీల పోటీలో నిలువగా ఉప ఎన్నిక ఈ నెల 19న నిర్వహించనున్నారు.

సర్పంచ్ పదవికి త్రిముఖ పోటీ

సారవకోట: మండలంలోని బద్రి పంచాయతీ సర్పంచ్ పదవికి జరుగుతున్న ఉప ఎన్నికకు ముగ్గురు అభ్యర్థులు పోటీలో నిలిచారు. సోమవారంతో నామినేషన్ల ఉప సంహరణకు గడువు ముగియడంతో ఇద్దరు అభ్యర్థులు పోటీ నుంచి తప్పుకున్నారు. కూన ఆదిలక్ష్మి, బలగ అమ్మలు, బొమ్మాళి ఆసిరమ్మ పోటీలో ఉండటంతో వీరికి గుర్తులు కేటాయించినట్లు ఎన్నికల అధికారి ఎంవీ రమణ తెలిపారు. ఈ నెల 19న ఎన్నికలు నిర్వహించి అదే రోజు ఫలితాలు వెల్లడిస్తామన్నారు.

బప్పడాం సర్పంచ్ బరిలో ఇద్దరు అభ్యర్థులు..

సరుబుజ్జిలి: బప్పడాం పంచాయతీ సర్పంచ్‌కు ఈ నెల 19న జరగనున్న ఉప ఎన్నికకు సంబంధించి అభ్యర్థులుగా పేడాడ అరుణ, పేడాడ వెంకటనర్సమ్మ పోటీలో ఉన్నట్లు ఎన్నికల అధికారి డి.బాలరాజు సోమవారం వెల్లడించారు. నలుగురు నామినేషన్లు వేయగా ఇద్దరు విత్‌డ్రా చేసుకున్నట్లు ప్రకటించారు.

పెద్దలంకాంలో..

బూర్జ: మండలంలో గల పెద్దలంకాం గ్రామ సర్పంచ్ ఉప ఎన్నికకు సంబంధించి ఇద్దరు అభ్యర్థులు బరిలో ఉన్నట్లు ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు సోమవారం తెలిపారు. పోటీల్లో ఉన్న అభ్యర్థులు కుమారపు అచ్చన్నాయుడు, కాగితాపల్లి గోవిందరావుకు గుర్తులు కేటాయించామన్నారు. సర్పంచ్ బరిలో 8 మంది పోటీలో ఉండగా.. ఆరుగురు అభ్యర్థులు తప్పుకున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

పలు వార్డు స్థానాలు ఏకగ్రీవం

నరసన్నపేట: మండలంలో ఏడు పంచాయతీల్లో 8 వార్డు స్థానాలకు ఉప ఎన్నిక జరుగుతుండగా ఆరు వార్డు స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. మేజరు పంచాయతీ నరసన్నపేటలో 7వ వార్డు అభ్యర్థిగా వారణాశి శివశంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మడపాంలో మెంతి శివాణి, దూకులపాడులో చిట్టి సుధారాణి, తెలగవలసలో చిప్పాడ రాము, కింతలి వెంకట సత్య విశ్వనాథం, చోడవరంలో గిడుతూరి అప్పలసూరి ఏకగ్రీవంగా ఎన్నికైనవారిలో ఉన్నారు. నరసన్నపేట నుంచి ఎన్నికైన శివ శంకర్ తటస్థ అభ్యర్థి. మిగిలిన ఐదు వార్డుల్లో గెలిచిన అభ్యర్థులు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు. మాకివలస పంచాయతీలో రెండో వార్డుకు పైల సింహాచలం, బుద్దల వినోద్ కుమార్ పోటీలో ఉన్నారు. అలాగే కోమర్తి పంచాయతీలో మూడో వార్డుకు పోటీ జరుగుతుండగా దూసి శ్రావణ్ కుమార్, లబ్బ రాజారావు పోటీ పడనున్నారు.

వార్డు మెంబర్‌గా శివకుమార్

పొందూరు: పొందూరు పంచాయతీ 14వ వార్డు ఉప ఎన్నికలలో అనకాపల్లి శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు నియామకపత్రాన్ని సోమవారం రిటర్నింగ్ అధికారి పీవీ రామరాజు అందించారు.

ఎల్.ఎన్.పేట: మండలంలోని బొత్తాడసింగి నుంచి 4వ వార్డుకు వాడాడ కుమారి, లక్ష్మీనర్సుపేట నుంచి 3వ వార్డుకు కరణం రమణమ్మ, రావిచెంద్రి నుంచి 7వ వార్డుకు పల్లి ఢిల్లేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఆర్ కాశీప్రసాద్ సోమవారం ప్రకటించారు. ఆయా పంచాయతీల నుంచి వార్డు సభ్యులకు ఒక్కొక్క నామినేషన్లు మాత్రమే దాఖలు కావటంతో ఎన్నిక ఏకగ్రీవం అయిందన్నారు.

పెద్దకోరాడలో విష జ్వరాలు



పెద్దకోరాడలో వైద్యశిబిరం నిర్వహించి రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

హిరమండలం: హిరమండలం మేజర్ పంచాయతీ పెద్ద కోరాడలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. వీరిలో కొందరికి డెంగీ లక్షణాలు ఉన్నట్లు తెలుస్తోంది. దేవిశ్రీపండా, తేజశ్విని పండా, వై.మైత్రియన్‌లు జ్వరం బారిన పడ్డారు. స్థానికంగా చికిత్స అందించినా తగ్గకపోవడంతో పాటు ప్లేట్‌లెట్లు పడిపోవడంతో పర్లాఖిముండి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి బరంపురం తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న హిరమండలం పీహెచ్‌సీ వైద్యసిబ్బంది స్పందించి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఇంటింటా ఫీవర్ సర్వే చేస్తున్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ సాయిగీత మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా నీరు నిల్వ ఉండి దోమలు పెరిగి జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామంలో క్లోరినేషన్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వేడి చేసి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. దోమల బారిన పడకుండా దోమ తెరలు వినియోగించాలన్నారు.

డీలర్ పోస్టుల నోటిఫికేషన్ రద్దు

నరసన్నపేట: స్థానిక సీఎస్ డీటీ పరిధిలోని నరసన్నపేట, పోలాకి మండలాల్లో ఖాళీగా ఉన్న డీలర్ స్థానాల భర్తీకి కలెక్టర్ ఇటీవల ఇచ్చిన నోటిఫికేషన్ రద్దు అయిందని, మళ్లీ కొత్త నోటిఫికేషన్ వస్తుందని సీఎస్ టీడీ రామకృష్ణ సోమవారం తెలిపారు. పోలాకి మండలంలో కొత్తరేవు, సుసరాం, పోలాకిలో రెండు డిపోల్లో శాశ్వత స్థాయిలో డీలర్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. అలాగే నరసన్నపేట పంచాయతీ పరిధిలోని బండి వీధి, సంతపేట, హడ్కోకాలనీ, కొత్తపోలవలస, పోతయ్యవలసల్లో డీలర్లు నియామకానికి నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. ఇవన్నీ రద్దు అయ్యాయని తెలిపారు. ఆయా గ్రామా ల ప్రజలు గమనించాలని కోరారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను పరిశీలిస్తున్న లక్ష్మీతులసి

నరసన్నపేట: రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం నిర్వహిస్తోందని, దీనిపై వైద్యులు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని ఫ్యామిలీ డాక్టర్ జిల్లా నోడల్ ఆఫీసర్ లక్ష్మీతులసి హెచ్చరించారు. నరసన్నపేట పంచాయతీ హడ్కో కాలనీలో సోమవారం మాకివలస పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ నిర్వహించారు. ఈ శిబిరాన్ని లక్ష్మీతులసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ పీహెచ్‌సీకి ఇద్దరు చొప్పున వైద్యులను ప్రభుత్వం నియమించిందని, దీంట్లో ఒక్కొక్కరు విడతల వారీగా ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంకు వెళ్లాల్సిందేనన్నారు. రోగులను తనిఖీలు చేయాలని, శిబిరం వద్దకు రాలేని రోగుల ఇంటికి వెళ్లాలని సూచించారు. అనంతరం రోగులతో మాట్లాడి సేవలపై ఆరా తీశారు. రోగుల వివరాలు విధిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. పీహెచ్‌సీ వైద్యురాలు శిరీషకు పలు సూచనలు చేశారు. డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వాన సురేష్ తదితరులున్నారు.

అందుబాటులో పాము కాటు మందులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పాము కాటు మందులు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ ఎస్.సునీత సోమవారం తెలిపారు. రైతులు, వ్యవసాయ కూలీలు పొలం పనులు చేస్తున్నందున ఎక్కువగా పాము కాటుకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. పాము కాటుకు గురైన వ్యక్తికి ఎలాంటి భయాందోళనలు కలిగించకుండా ఆస్పత్రికి తరలించాలన్నారు.

అమరుల త్యాగాలను స్మరిద్దాం



కొత్తూరులో అమరవీరుడు అరి నాగేశ్వరరావు భార్య కళావతిని సత్కరిస్తున్న సర్పంచ్ కృష్ణవేణి, నాయకులు



సారవకోట: మాకివలసలో విశ్రాంత ఆర్మీ ఉద్యోగిని సన్మానిస్తున్న గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

దేశ స్వాతంత్ర్యం కోసం అమరులైన త్యాగమూర్తులను స్మరించుకోవడం మనందరి భాధ్యతని పలువురు వక్తలు అన్నారు. నా మట్టి– నా దేశం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. గ్రామాల్లో మొక్కలు నాటి, నేలతల్లికి నమస్కరించి, వీరులకు వందనం సమర్పించారు. మట్టి పట్టుకుని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్